ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.30.01.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదాలపై ఏర్పాటైన ప్రత్యేక కమిటీ ఈ రోజు ఢిల్లీలో సమావేశమై నీటి పంపకాలు, సమస్యలు, వివాదాలపై చర్చిస్తోంది.
2. రాష్ట్రంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు ఈ రోజుతో ముగిసింది.
3. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్ ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ రోజు విచారించారు.
4. మేడారం భక్తజన సంద్రంగా మారింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు ఈ రోజు సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

--------------------------------

**నదీ జలాల వివాదాలపై కమిటీ**

తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదాలపై ఏర్పాటైన కమిటీ.. కేంద్ర జలసంఘం కార్యాలయంలో ఈరోజు సమావేశమైంది. జలసంఘం ఛైర్మన్ అధ్యక్షతన జరుగుతున్న సమావేశానికి సీడబ్ల్యూసీ అధికారులు, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ, ఎన్‌డబ్ల్యూడీఏ ఛైర్మన్లు, కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీర్, తెలుగు రాష్ట్రాల అధికారులు హాజరయ్యారు. నీటి పంపకాలు, సమస్యలు, వివాదాలపై అధికారుల కమిటీ తొలిసారి భేటీ అయ్యింది.

**డెస్క్**

---------------------

**మున్సిపల్ ఎన్నికలు**

రాష్ట్రంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల్లో భాగంగా తొలి పర్వం ఈ రోజు ముగిసింది. చివరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ సాయంత్రం 5 గంటలకు నామినేషన్ గడువు మగియగా.. అప్పటి వరకు క్యూలైన్‌లో ఉన్న వారిని నామినేషన్ వేసేందుకు అనుమతిస్తున్నారు. రేపు అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు గడువు ఉంది. రాష్ట్రంలో మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 11న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరగుతుంది.

**డెస్క్**

---------------------------

**సీఎస్**

రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికను దృష్టిలో పెట్టుకొని నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని, భవిష్యత్ లో యూరియా, ఎరువులను ఐటి ఆధారిత సేవల ద్వారా పటిష్టంగా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల మేరకు అన్ని ప్రభుత్వ విభాగాలకు దిశానిర్ధేశం చేసేందుకు గత మూడు రోజులుగా విభాగాల వారీగా సీఎస్ రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ఈ రోజు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హార్టికల్చర్ తదితర శాఖలలో అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్, ప్రజల అవసరాల మేరకు పండ్లు, కూరగాయల పెంపకం విస్తృతంగా ప్రోత్సహించాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం హైబ్రిడ్ మోడ్ లో భాగంగా చేపట్టిన రంగారెడ్డి జిల్లా కోహెడ మార్కెట్ నిర్మాణ పనులపై సమీక్ష చేశారు. అదే విధంగా రాష్ట్రంలో రైతుల సంక్షేమం, పంటల దిగుబడి, రైతు సమస్యల పట్ల వ్యవసాయ

శాఖ నిరంతర మానిటరింగ్ చేయాలని డిజిటల్ క్రాప్ సర్వే కూడా నిర్వహించాలని సూచించారు. సహకార సంఘాలను మరింత పటిష్టం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**జీఎస్**

-----------------------------

**ప్రదర్శన**

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద తెలంగాణ కళాకారులు ప్రదర్శించిన పేరిణి శివతాండవం అక్కడి ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ మధ్యాహ్నం జ్ఞాన్‌పథ్ వద్ద తెలంగాణకు చెందిన కళాకారులు 'భారత్ పర్వ్-2026'లో భాగంగా పేరిణి నృత్యాన్ని ప్రదర్శించారు. యుద్ధభూమికి వెళ్ళే ముందు శివుని గౌరవార్థం ఉత్సాహంగా ప్రదర్శించడం వల్ల దీనిని 'యోధుల నృత్యం' అని కూడా పిలుస్తారు. సుమారు 800 సంవత్సరాల నాటి ఈ పేరిణి నృత్య రూపం కాకతీయ పాలనలో తెలంగాణలో ఉద్భవించి అభివృద్ధి చెందింది. గణతంత్ర వేడుకల్లో భాగంగా జ్ఞాన్‌పథ్ వద్ద ప్రతి సంవత్సరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ నేతృత్వంలో కళాకారులు ఈ ప్రదర్శన నిర్వహించారు.

**డెస్క్**

------------------------------------

**హరీష్ రావు**

తెలంగాణ నీటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రక ద్రోహం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఈ రోజు ఢిల్లీలో జరుగుతున్న జలవనరుల శాఖ సమావేశం తెలంగాణకు బ్లాక్ డే అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన నల్లమల సాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు చెందాల్సిన 200 టీఎంసీల గోదావరి జలాలను తరలించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 400 టీఎంసీల అనుమతులు తెస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క డీపీఆర్ కూడా పంపలేకపోగా, ఉన్న అనుమతులను కూడా కాపాడుకోలేక పోతోందని విమర్శించారు.

**(HYD -PTC)**

--------------------------------

**ఫోన్ ట్యాపింగ్-కేసీఆర్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ రోజు విచారణకు హాజరు కావాలని ప్రత్యేక దర్యాప్తు బృందం తనకు జారీ చేసిన నోటీసులపై బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు స్పందించారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో తలమునకలై ఉన్నందున, విచారణకు మరో తేదీని కేటాయించాలని చంద్రశేఖర్ రావు కోరారు. అలాగే, సీఆర్పీసీ సెక్షన్ 160 ప్రకారం 65 ఏళ్లు పైబడిన వారిని వారి నివాసంలోనే విచారించాలనే నిబంధనను గుర్తు చేస్తూ, తనను సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన నివాసంలోనే విచారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో సిట్ అధికారులు ఇప్పటికే ఆ పార్టీ నేతలు, మాజీ మంత్రులు హరీశ్ రావు, తారక రామారావు, మాజీ ఎంపీ సంతోష్ రావు ను విచారించారు.

**(డెస్క్)**

------------------------------

**దానం నాగేందర్**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ వద్ద ఈ రోజు విచారణ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ జరిపారు. అయితే, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాము బిజీగా ఉన్నామని, విచారణను వాయిదా వేయాలని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన స్పీకర్.. బీజేపీ పిటిషన్‌పై విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేశారు. అటు దానం నాగేందర్ కూడా తాను వ్యక్తిగతంగా హాజరయ్యేందుకు సమయం కోరడంతో, తదుపరి పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

**(HYD -PTC)**

---------------------------------

**గవర్నర్ - మేడారం**

మేడారం ఈ రోజు భక్తజన సంద్రంగా మారింది. వనదేవతలు అందరూ గద్దెలపై కొలువుదీరడంతో ఈ రోజు ప్రధాన జాతర జరుగుతోంది. మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షల సంఖ్యలో జనం తరలివచ్చారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు ఈ రోజు మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. మద్యాహ్నం మేడారం చేరుకున్న గవర్నర్ వనదేవవతలను దర్శించుకుని నిలువెత్తు బంగారాన్ని సమర్పించుకున్నారు.

**జీఎస్**

---------------------------

**అడ్లూరి లక్ష్మణ్**

జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ధర్మపురిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి వాడవాడలా తిరుగుతూ ఓటర్లను కలిశారు.

**పీటీసీ – జగిత్యాల**

---------------------------

**డీకే అరుణ**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ లబ్ది పొందేందుకే మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు ఇచ్చారని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు ఎంపీ డీకే అరుణ విమర్శించారు. ఈ రోజు మహబూబ్ నగర్ లోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ...

**Byte: డీకే అరుణ**

**పీటీసీ – మహబూబ్ నగర్**

---------------------------

**తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయులు, లెక్చరర్లు కృషి చేయాలని తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్, సెక్రటరీ కృష్ణ ఆదిత్య అన్నారు. ఈ రోజు యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... ఫిబ్రవరి 2 నుండి ప్రారంభమయ్యే ప్రాక్టికల్ పరీక్షలు, ఫిబ్రవరి 25 నుండి జరిగే వార్షిక పరీక్షలను ఎటువంటి అవకతవకలు లేకుండా సజావుగా నిర్వహించాలని సూచించారు. ఇంటర్ ఫలితాలలో ఉత్తీర్ణత శాతం పెంచడంతో పాటు, వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**పీటీసీ - యాదాద్రి భువనగిరి**

-------------------------

**భద్రాచలం-హుండి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి హుండీని లెక్కించగా.. మొత్తం సుమారు 2 కోట్ల 30 లక్షల రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో దామోదర్ రావు తెలిపారు. అలాగే 56 గ్రాముల బంగారం, 14 వందల గ్రాముల వెండితో పాటు వివిధ దేశాలకు చెందిన కరెన్సీని కూడా భక్తులు కానుకలుగా స్వామి వారికి సమర్పించినట్లు చెప్పారు.

**(PTC-B. KGM )**

-------------------------

**గాంధీ-కామారెడ్డి**

సత్యం, న్యాయం, సమానత్వం, గ్రామ స్వరాజ్యం వంటి విలువలను దేశ ప్రజలకు అందించిన మహనీయుడు.. మహాత్మా గాంధీ అని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జుక్కల్ లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

**(పీటీసీ, కామారెడ్డి)**

-------------------------

**జనగామ సెలవు**

మేడారం మహా జాతరను పురస్కరించుకొని ఈరోజు జనగామ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించారు. ఈ స్థానిక సెలవు బదులుగా ఫిబ్రవరి 14న రెండవ శనివారం పని దినంగా పరిగణించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ తెలిపారు.

**(పిటిసి జనగామ జిల్లా )**

------------------------

**మిడ్ మానేరు**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్దగల శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతోందని, ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. దిగువకు 500 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 250 క్యూసెక్కుల మేర నీటిని విడు దల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టులో నీటి మట్టం 25.349 టీఎంసీలకు చేరిందని తెలిపారు.

**(పిటిసి రాజన్న సిరిసిల్ల జిల్లా)**

--------------------